# తెలుగు కథా రచయితా..

ఆరు కుడి చేతులు ఒక్కసారిగా పైకి లేచాయి. చేతుల్లో గ్లాసులు... వాటిలో మందు ఉంది.

'ఛీర్స్' చెప్పుకున్న తరవాత గ్లాసులు పెదాలను తాకాయి.

ఆరుగురి గొంతుల్లోకి 'విస్కీ' మెత్తగా జారింది.

"వెల్! డియర్ ఫ్రెండ్స్.... మనం ఆరుగురం కలసి ఇక్కడ ఏకమై మందు కొట్టడంలో గల అంతరార్థం మనందరికీ తెలుసు—" కార్యదర్శి వల్లభరావు ఉపన్యాసాన్ని ప్రారంభించిన వాడల్లా ఆపుచేసి గ్లాసులో మందుని మరోసారి సిప్ చేశాడు.

గోవిందరావు చిరునవ్వు నవ్వాడు.

"మన మిత్రుడు గోవిందరావుకి కథల పోటీలో బహుమతి రావటం మాట అలా ఉంచి ఆ కథను అతి త్వరలో సినిమా తీయబోతున్నందుకు మనందరికీ ఎంతో సంతోషంగా ఉంది..." కోశాధికారి రాజు అందుకున్నాడు.

'మాచకమ్మ మళ్ళీ పుట్టింది' అనే మనవాడి బహుమతి పొందిన కథ వెనువెంటనే వెండి తెరకు ఎక్కబోతున్నందుకు... పైపెచ్చు ఆ సినిమాకి మన గోవిందరావే మాటలు వ్రాసే అవకాశం కలగటంతో బాటు.... ప్రగతి పథంలో పయనిస్తున్న ప్రథమ తెలుగు సినీ దర్శకురాలు అయినటువంటి శ్రీమతి అంబికాంబ మనవాడి కథా చిత్రానికి దర్శకురాలు కావటం ఎంతైనా ముదావహం...." కమిటీ ప్రెసిడెంటు మన్మథరావు విషయ పూరణగావించాడు.

గోవిందరావు మినహా మిగతా నలుగురూ చప్పట్లు చరిచారు.

గోవిందరావు ఆ వూళ్ళో చెయ్యితిరిగిన ఘనాపాటీ రచయిత కాదు. పుంఖాను పుంఖాలుగా కథలు... శతాధికంగా నవలలు వ్రాసి పారేసిన గ్రంథకర్త అంతకంటే కాదు.

ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్న వర్ధమాన రచయిత గోవిందరావు అతడి ఆలోచనలు చురకత్తుల్లా పదునుగా ఉంటాయ్. కథల్లోని సంఘటనలు ... సంభాషణలు పాఠకుడి ముక్కుమీద గుద్దినట్టు అనిపిస్తాయ్.

ఈ డొంక తిరుగుడంతా లేకుండా చెప్పాలీ అంటే... గోవిందరావు కథలు రియాలిటీకి దగ్గరగా ఉంటాయి. ఆకాశంలో విహరించడాలూ అభూత కల్పనలూ ఉండవు గోవిందరావు కథల్లో...

"మనవాడి కథకు బహుమతి వచ్చిన సందర్భంలో మనమంతా ఏకమై సన్మానమే ఏర్పాటు చేయాల్సింది. కానీ... మనవాడి అదృష్టం తలవని తలంపుగా మరో మలుపు తిరిగింది. సినిమా రచయితగా పరిచయం కాబోతున్నాడు. ఈ కారణంగా మనవాడి పిక్చర్ రిలీజు ఆయాక మన రచయితల సంఘం తరపున సన్మాన కార్యక్రమం పెద్ద ఎత్తున చేయాలనుకుని... ప్రస్తుతానికి ఈ విధమైన చిన్న సైజు మందు పార్టీతో సరిపెట్టుకుంటున్నాం. కార్యదర్శి వల్లభరావు తన ఆంతర్యాన్ని బహిర్గతం చేశాడు.

"హియర్... హియర్..." అన్నారంతా.

తలొక రకంగా తనను కొనియాడుతుంటే... గోవిందరావు ఆలోచనలు మద్రాసు మహానగరం చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. అనేక రకాల వూహాలు మనిషిని తికమక పెట్టేస్తున్నాయి.

"మరో విశేషమేమంటే... అభ్యుదయ భావాలున్న మహిళా దర్శకురాలి చేతిలో మనవాడి కథ పడటం నిజంగా మనవాడి అదృష్టం! గోవిందరావు సినిమా తప్పకుండా

సెంచరీ కొట్టక మానదు. ఆ తరవాత మనవాడిని పట్టనలవి కాదు. ఆఫర్ల మీద ఆఫర్లు" అనేదో చెప్పబోయిన వాడల్లా టక్కున ఆగేడు మన్మథరావు.

అందరి గ్లాసులూ ఖాళీగా కనిపించాయి... అంటే... ఆరుగురూ కలసి వెరసి ఒక ఫుల్ బాటిల్ వూదేశారన్న మాట.

"ఒరేయ్, కోశాధికారీ – మరో సీసా తెప్పించరా!!– మనవాడు మద్రాసు వెడితే అక్కడ మందు కొట్టేందుకు ఎట్లాగూ వీలుండదు..." డౌట్ వెలిబుచ్చాడు కార్యదర్శి.

అవకాశం... లేదూ... వీలు ఎందుకుండదూ అనే భావనలో అంతా కార్యదర్శి కేసి దృష్టి సారించారు.

"మీ డౌట్ నా కర్థమైంది! తమిళనాడులో ప్రొహిబిషనుంది! మనవాడి శషభిషలేం అక్కడ పనిచెయ్యవు. అర్థమైందా!?— అదీ పాయింటు..." విశదీకరించాడు కార్యదర్శి.

"పేరుకేనోయ్ ప్రొహిబిషను – సినిమా రచయితలకు మూడ్ రావాలీ అంటే... బ్లూ బ్లాక్ సిరాబుడ్డితో బాటు మేక్డొవెల్ విస్కీ బాటిలూ అరేంజి చేస్తాడు నిర్మాత! అలా చేయకుంటే రచయిత గాళ్ళ చేత కథా మాటలూ పాటలూ వ్రాయించుకోవాలీ అంటే... నిర్మాత తాత దిగొస్తాడు.

అండర్‌స్టాండ్..." తన కేదో నిజం తెలిసినట్టు పేలాడు ప్రెసిడెంటు.

"ఒక్క సిరాబుడ్డీ... విస్కీ బుడ్డీ అన్న మాటేమిటి.. ఎ. సి. రూము... తాండూరు చికేన్. కొండ మీది కోతి... ఏది తెచ్చిపెట్టమన్నా తెస్తాడు నిర్మాత!..." మరో సభ్యుడి ఉవాచ.

"గొంతెమ్మ కోరికలేవీ నాలో లేవ్రా!— ఆ ఏడు కొండల వాడి దయవల్ల నా – ప్రథమ సినీమా ప్రయత్నం సక్సెస్ అయితే చాలు...." అనేశాడు అల్ప సంతోషి గోవిందరావు.

"పైకొచ్చేదాకా అంతా నీకు మల్లేనే నీతి పాఠాలు వల్లిస్తారోయ్. రంగంలోకి ప్రవేశించాక ఇక రచయితగాడి ఈ రంగాలు చూడలేక చస్తాడు నిర్మాత!..." మూడ్‌లోకి వెళ్ళిపోయిన అహోబలరావు నగ్న సత్యాన్ని కుండ బద్దలు కొట్టినట్టుగా చెప్పాడు.

ఇంతలో... కోశాధికారి ఆజ్ఞ ప్రకారం మరో విస్కీ సీసా జానపద తెలుగు సినిమాలో మాంత్రికుడు ప్రత్యక్షమైనట్లు టక్కున సాక్షాత్కరించింది.

ఎవరి ఖాళీ గ్లాసులు వాళ్ళు ముందుకు నెట్టారు.

మళ్ళీ మందుతో, సోడాతో అందరి గ్లాసులూ నిండాయి.

"ఒరే, పిసినారి కార్యదర్శీ... గోవిందరావు గ్లాసులో మందు మరి కాస్త పొయ్యరా.... చుక్క చుక్కా కొలిచ్చి మరీ పోస్తున్నావ్..... రేషన్ కార్డు మీద కోట్టు వాడు చక్కెర ఇచ్చినట్టు..."

ప్రెసిడెంటు విట్టుకి అంతా పగలబడి నవ్వారు.

మరో రౌండు లాగించారు.

మైకంలో సభ్యులందరి కళ్ళూ మూతలు పడుతున్నా, గోవిందరావు సినీరంగ ప్రవేశం మహోజ్వలంగా సూర్య బింబంలా ప్రజ్వరిల్లాలని ఏకగ్రీవంగా ఆకాంక్షించారు.

ఆ నాటి ఆ వూరి రచయితల సంఘం అర్జంటు సమావేశం... మందు పార్టీ దివ్యంగా ముగిసింది.

ఒక నెల రోజులు ఎరండు లీవు పెట్టి.... మామగారి నడిగి అయిదు వందలు చే పట్టి గోవిందరావు మద్రాసు రైలెక్కాడు.

సెంట్రల్లో దిగిన గోవిందరావు నిర్మాత కోసం ఫ్లాట్ ఫారంమీద నిల్చుని చాలా సేపు దిక్కులు చూశాడు.

ప్రయాణీకులంతా వెళ్ళిపోగా చివరికి తానొక్కడే మిగిలాడు.

ఇక లాభం లేదనుకుని సిటీ బస్సెక్కి పాండీ బజార్లో దిగాడు.

నిర్మాత వ్యాఘ్రేశ్వరరావు ఇల్లు వెతుక్కోవ—నారంభించాడు.

ఒక గంట సేపు ప్రయాసపడ్డ తరువాత నిర్మాత ఇంటి ఆచూకీ తెలుసుకోగలిగినందుకు సంబరపడ్డాడు.

అప్పుడే కార్లో బైటికి వెళ్ళబోతున్న వ్యాఘ్రేశ్వర రావు గోవిందరావుని చూచి కారు దిగి వచ్చి అమాంతం కౌగలించుకుని ఇంట్లోకి నడిపించాడు.

పరామర్శ, కుశల ప్రశ్నలు అయ్యాక "చూడండి, గోవిందరావు గారూ!... మనది ఇదే తొలి ప్రయత్నం కావటంతో బడ్జెట్ పిక్చరు తీయాలనుకుంటున్న విషయం మీకు వ్రాశాననుకుంటాను" అంటూ గోవిందరావు భుజం మీద చెయ్యివేసి నడిపించుకుంటూ రోడ్డెక్కా—డు వ్యాఘ్రేశ్వర రావు.

ఒక ఇరుకు సందులో ఉన్న చిన్న సైజు హోటల్లోకి నడిచా రిద్దరూ.

ఒక గది అద్దెకి తీసుకున్న వ్యాఘ్రేశ్వరరావు "మా ఇంటికి దగ్గర్లో ఉండాలనే ఉద్దేశంతో ఈ హోటల్లోనే రూమ్ తీశాను..." అన్నాడు.

ఆ గది చూశాక మూడ్ రావటం మా టెలా ఉన్నా ఆ రూమ్‌లోకి కనీసం గాలీ, వెలుతురూ అయినా సరీగా వచ్చేట్టు లేవని అన్పించింది గోవిందరావుకి.

"మీరు స్నానం గట్రా కానివ్వండి— మరో అర గంటలో నేను వస్తాను— ఆ తర్వాత ఇద్దరం కలిసి డైరెక్టరు గారింటి కెళదాం." అనేసి వెళ్ళి పోయాడు వ్యాఘ్రేశ్వరరావు.

బడ్జెట్ పిక్చర్ అనే మాట ఎందుకో సడన్‌గా గుర్తొచ్చిన గోవిందరావుకి తనకు చేసిన బస ఏర్పాటు చూచి మరీ లోబడ్జెట్‌లో ఉన్నదనిపించింది.

*　　*　　*　　*

సాయంత్రం ఆరు గంటల కల్లా నిర్మాతా, గోవిందరావూ కలిసి దర్శకురాలు అంబికాంబ గారింటి కెళ్ళారు.

మధ్య హాల్లో ఉన్న సోఫాలో ఠీవిగా అపరకాళిలా కూర్చున్న శ్రీమతి అంబికాంబను చూస్తూ రెండు చేతులు జోడించి నమస్కరించేశాడు గోవిందరావు.

దీర్ఘాయుష్మాన్భవ అనే ఫోజులో తన బరువైన కుడి చేతిని నింపాదిగా పైకెత్తి ఆశీర్వదించింది అంబికాంబ— ఎడంచేత్తో కూర్చోమన్నట్టు సైగ చేసింది, చిరునవ్వు రువ్వుతూ.

అతి వినయంగా వొదిగి వొదిగి కూర్చున్నాడు గోవిందరావు — ఎదురుగా ఉన్న మరో సోఫాలో మచ్చికైన బొచ్చు కుక్కపిల్లలాగ.

పరామర్శ పూర్తి అయాక నిర్మాత వేపు తిరిగి "రచయిత గారికి ఎలాంటి లోటు రాకుండా చూచుకోవటం మీా ధర్మం!— అన్ని ఏర్పాట్లూ చేసి నట్లేనా ." అని అడిగింది అంబికాంబ.

ఏం జవాబివ్వాలో తెలియక నిజాన్ని, అబద్ధాన్ని మిళాయించినట్టుగా బదులు చెప్పకుండా బుర్ర వూపాడు వ్యాఘ్రేశ్వరరావు.

చిద్విలాసంగా గోవిందరావు కేసి చూచి "ఏర్పాట్లు మీాకు తృప్తికరంగా ఉన్నాయా?—" అని అడిగింది.

అన్నీ బాగానే ఉన్నాయన్నట్టు నవ్వి వూరుకున్నాడు గోవిందరావు.

'హమ్మయ్య!' మొత్తానికి రచయిత మంచివాడే సుమీా! అనుకున్నాడు నిర్మాత. మనసులోనే గోవిందరావు మంచితనాన్ని అభినందించాడు.

"ఈ పిక్చర్ హిట్టయిందంటే... తర్వాత తీయబోయే 'మంత్రదండం మళ్ళీ దొరికింది' అనే జానపద చిత్రాని కూడా మీాచేతనే కథా డైలాగులూ వ్రాయించాలనుకున్నాం..." అంది అంబికాంబ.

ఆ మాటకి మురిసిపోయాడు గోవిందరావు.

ఆ తరువాత సినీమా రచయితకు ఉండవలసిన లక్షణాలను గురించి ఒక అరగంటసేపు లెక్చరుదంచింది అంబికాంబ.

గుడ్లు అప్పగించి, చెవులు రిక్కించి దర్శకురాలు చెప్పిందంతా శ్రద్ధాసక్తులతో విన్నాడు గోవిందరావు.

"చూడండి, గోవిందరావుగారూ! మీ కథా స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని సినీకార్డర్ తయారు చేయండి ముందు — రెండు రోజులు పోయాక కథలో మార్పులూ చేర్పులూ ఏవైనా కావాల్సివస్తే డిస్కస్ చేద్దాం...." అంది.

అందుకు బుర్ర ఆడించాడు.

"మరి నాకు అవతల మరో అపాయింటుమెంటుంది.." అనేసి దగ్గర్లో ఉన్న ఫోను మీద రిసీవరు చేతిలోకి తీసుకుంది.

గోవిందరావూ, నిర్మాతా లేచి నిల్చుని ఆమె దగ్గర సెలవు తీసుకున్నారు.

* * * *

సినిమా రచయితంటే.... మద్రాసులో ఏ హోటల్ 'చోళా' లోనో రూమ్ తీసుకుని, విమానమంత కార్లో సిటీ అంతా తిప్పి చూపిస్తారనీ ఆశపడ్డ గోవిందరావు నిర్మాత చేసిన ఏర్పాట్లు చూచి నిరుత్సాహపడ్డాడు.

కకుర్తి విలాస్‌లాంటి చిన్న సైజు ఉడిపి హోటల్లో ప్లేటు భోజనం.... చీకటి కొట్టంలాంటి గదిలో నివాసం చూస్తున్న గోవిందరావుకి నిర్మాత మరీ పిసినారిలా కనిపించాడు.

కిందా మీదా పడి ఎట్లాగో రెండు రోజుల్లో కథ తాలూకు సినీ కార్డర్ తయారుచేశాడు.

తొలి రోజు కథా చర్చలో దర్శకురాలు, నిర్మాత, పంపిణీదారుడు, అసోసియేటు, అసిస్టెంటు వెరసి మొత్తం గోవిందరావుతో సహా ఆరుగురయ్యారు.

కథ ఆసాంతం విన్న తరువాత నోరు చప్పరించాడు డిస్ట్రిబ్యూటరు.

నిర్మాత బుర్ర గోక్కున్నాడు.

అంబికాంబ ఆలోచనలో పడ్డది.

అసోసియేటూ, అసిస్టెంటూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

అందరూ ఎందుకట్లా మౌనంగా ఉండిపోయారో బోధ పడలేదు గోవిందరావుకి – నిర్వికారంగా అందరి ముఖాల్లోకి దీనాతిదీనంగా చూశాడు.

చూడు, బాబ్జీ! కథ క్లైమేక్సులో హీరోని హీరోయిన్ హత్య చేయటం బాగా లేదు. పిక్చర్ ఎక్కువ రోజులు ఆడదు. జనం చూడరు. యాంటీ సెంటిమెంటు అనేస్తారు..."
పెదవి విరుస్తూ అభిభాషించాడు డిస్ట్రిబ్యూటరు.

"అన్ని సినిమా కథల్లోనూ హీరో తాగి తందనాలు తొక్కి భార్యను... అంటే హీరోయిన్‌ని చావ చితక్క-

కొట్టినా— హిందూసంప్రదాయ ప్రకారం హీరోయిను... స్వామీ, నేను మీ పాద దాసిని. నేను సతీ సావిత్రి, అనసూయవంటి సాధ్వీలలామను... అనేస్తుంది— కానీ... నా సబ్జక్టు అది కాదు, సార్! — హీరోయినే మందు కొట్టి హీరోను రేప్ చేస్తుంది. ఆ తరవాత హీరోను చావ చితక కొట్టేస్తుంది. అందుకు కారణం లేకపోలేదు., తల్లి కావాలని ఆరాపడే హీరోయిను... హీరోలాంటి భర్త తనకు ఉండి కూడా తల్లి కాలేకపోయిందనే బాధతో — ఆరాటంతో చావచితక కొడుతుంది. – మన కథలో నవ్యత ఇదే, సార్. దీన్ని మీరు అంగీకరించకపోతే నా కథే తల్లకిందులై పోతుంది...'' రెట్టించిన స్వరంతో వాదించాడు గోవిందరావు.

"నవ్యత అనేది పత్రికల్లో కథల వరకే పరిమితం బాబ్జీ! ఇది సినిమా! — దీని కో ఫార్ములా ఉంది. ఆపైన బాక్సాఫీసు సూత్రాలున్నాయి— అందుకు భిన్నంగా మనం పిక్చర్ తీస్తే... రెండో రోజుకే డబ్బాలు తిరిగొచ్చేస్తాయ్- నా నెత్తికి కొంగు... నిర్మాత చేతికి చిప్పా వస్తుంది. అందు కనీ... వో తెలుగు కథా రచయితా, నువ్వు చచ్చినట్టు కథమార్చి తీరాలి! — అంతే గాని హీరోను హతమార్చ కూడదు. అర్థమైందా?— '' బల్లగుద్ది మరీ చెప్పాడు డిస్ట్రిబ్యూటరు.

డిస్ట్రిబ్యూటరు అభిప్రాయంతో ఏకీభవించ లేక పోయాడు గోవిందరావు.

దర్శకురాలు కిమ్మనకుండా కూర్చోవటం బొత్తిగా నచ్చలేదు.

"అంబికాంబ ముఖంలోకి చూస్తూ" అంబా! జగదాంబా ... పరమేశ్వరీ ... పరాత్పరీ ... తమరి సలహా ఏమిటో కూడా సెల వీ య ం డి. కథను మార్చాలిసిందే నంటారా? తప్పదా? ? —" బేలగా— జాలిగా బాధగా అడగాలనుకున్న గోవిందరావు ఆముదం తాగినవాడిలా ముఖం పెట్టాడు.

"అవునండీ! సినిమా అంటే మీరంతా ఒక కళ అనుకుంటారు, హాల్లో కూర్చుని! కానీ .. కానే కాదు. ఇది లక్షలతో వ్యాపారం. ఇల్లూ వాకిలీ. పెళ్ళాం మెళ్ళో తాళీ తెగనమ్మి సినిమా తీస్తాడు నిర్మాత — మరి ... మంచి సినిమా తీయటం... నిర్మాత శ్రేయస్సు కోరటం... దర్శకురాలిగా నా ధర్మం కదా... అందుచేత మీరు కథను ఆసాంతం కాకపోయినా అక్కడక్కడ మార్చాలి! — తప్పదు..." అంది అంబికాంబ.

ఆ మాట విన్న గోవిందరావు హతాశుడయ్యాడు.

"మీ కథకి ప్రైజు వస్తే వచ్చి ఉండవచ్చు! కాదననూ!!— కానీ... ఆ కథని యథాతథంగా సినిమా తీస్తే కల

క్షణ్ణు మాత్రం ఉండవ్..." అసోసీయేటూ, అసిస్టెంటూ ముక్త కంఠంతో చెప్పారు.

అందుకు హర్టు అయ్యాడు గోవిందరావు.

వాళ్ళ మాటకి చిర్రెత్తుకొచ్చింది. వారి వేపు కొర కొరా చూశాడు.

'వీళ్ళ కేం తెలుసు కథంటే? — కుర్రకుంకలు... వీళ్ళా కామెంటు చేసేవాళ్ళైనా? వంకలు పెట్టే వాళ్ళైనా?- అని వాపోయాడు గోవిందరావు.

అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఉచిత సలహాలు ఇచ్చారు... సూచనలు చేశారు...

ఇందరి ఆలోచనలతో సినిమా కథ రాయాలంటే అది తన స్వంత కథెలా అవుతుంది? పది పాత తెలుగు సిని మాలు.... నాలుగు హిందీ పిక్చర్లు... రెండు తమిళ సినీ మాలు... ఒక మలయాళ చిత్రం... వీటన్నిటినీ కలిపి కల బోసి ఆలోచిస్తే ఒక సినిమాకు మళ్ళీ కథ తయారు కావచ్చు!- కానీ అలా చేయటం గోవిందరావుకి ఇష్టం లేదు.

అప్పటికే బాగా పొద్దు పోయిందనిపించటంతో ఆనాటి సినిమా తాలూకు చర్చ ఇంకో రోజుకి వాయిదా పడ్డది.

*            *            *            *

సినిమా ప్రపంచంలో రచయిత అనేవాడు కేవలం ఒక బొమ్మ అనే నిర్ణయానికి రాక తప్పలేదు గోవిందరావు.

ఇరవై రోజుల్లో తనకు అనుభవం నేర్పిన గుణపాఠం అది!!

సినీమా రచయితకి వ్యక్తిత్వం ఉండకూడదా? – లేక ఈ మనుష్యులు ఉండనివ్వరా? అనేవి గోవిందరావులో ప్రశ్నార్థకాలుగా మిగిలాయి.

అక్కరకురాని చుట్టంలా ... ఆసులో గొట్టంలా.... అన్నీ వదిలేసి.. అన్నిటినీ చంపుకుని... తానే అంటే తందానా అంటూ... ఏడవలేక నవ్వుతూ... ఇష్టం లేకపోయినా వారి అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు నటిస్తూ... వాళ్ళు చెప్పిన దానికల్లా గంగిరెద్దులా తలూపుతూ... 'భేష్' అంటూ పొగడుతూ... మధ్య మధ్య ఎవరూ చూడకుండా ఏడుస్తూ... వగరుస్తూ...చేజిక్కిన అవకాశాన్ని, ఛాన్సుని సద్వినియోగ పరచుకోవటం తప్పించి వేరే మార్గం లేదనే నగ్న సత్యాన్ని తెలుసుకుని రూఢి చేసుకోక తప్పలేదు గోవిందరావు.

ఇక్కడా కాకాలూ... వ్యక్తి పూజలూ... భట్రాజు పొగడ్తలూ.... వాన పాములూ.... కొండచిలువలూ.... అనేకం ఉన్నాయని తెలుసుకున్నాడు.

ఆ రోజు సాయంత్రం మళ్ళీ దర్శకురాలు బంగళాలో చర్చ మొదలైంది.

"అన్నా చెల్లెళ్ళ ప్రణయ సన్నివేశంలో డైలాగులు చప్పగా వ్రాశారు..." అంది అంబికాంబ.

"ప్రణయ సన్నివేశం కాదండీ... ప్రేమ సన్నివేశం... అయినా అన్నా చెల్లెళ్ళ అనురాగాన్ని భూతద్దంలో భిన్న రీతిలో చూపించి, వీక్ నెస్ ని ఎక్స్ప్లాయిట్ చేసి తెరకెక్కించట మేమిటీ..." అనేసి నెత్తీ నోరూ బాదుకున్నాడు గోవింద రావు.

"అక్కడే పొరబడుతున్నారు. అన్నా చెల్లెళ్ళ మధ్య డ్యూయెట్లూ.... కౌగలింతలూ.... ఉన్న సినిమాలు తెలుగులో కోకొల్లలుగా వున్నాయి. మీరు చూడ లేదా ఏమిటీ? — అలాంటి పిక్చర్లేనండీ హిట్టయ్యేది..." అంటూ వికృతంగా నవ్వింది అంబికాంబ.

"సెంటిమెంటండీ, బాబూ! – తెలుగు సినిమా సెంటిమెంటు!! — ఇలాంటి సన్నివేశాలు.... మన పిక్చర్లో ఉండకపోతే.... పిక్చరు గోవిందే...." లబోమన్నాడు వ్యాఘ్రేశ్వరరావు.

ఆ మాటకి చిర్రెత్తుకొచ్చింది గోవిందరావుకి. తనకు అవకాశ వాదం నచ్చదు. అందుకే వాళ్ళ అభిప్రాయాలతో రాజీపడలేకపోతున్నాడు.

నసిగాడు – ఇబ్బంది ఫీలయ్యాడు. సీను మార్చి వ్రాసేటందుకు మనస్కరించటంలేదు.

"మీరు కామెడీ సీను వ్రాసినంత ఎఫెక్టివ్ గా లవ్

సీన్లు వ్రాయలేకపోతున్నారు....” మరో విసురు విసిరింది అంబికాంబ.

ఆ మాటకి కంగు తినలేదు గోవిందరావు.

అవును. తనకు లవ్వంటే తెలియదు. తానెవ్వరినీ లవ్ చెయ్యలేదు. అందుకే ఆ అనుభూతి ఎలాంటిదో నిర్వచించ లేకపోతున్నాడు. తన బలహీనత తనకు తెలుసు!— తెలియని విషయాన్ని గురించి గొప్పగా వ్రాయటం గోవిందరావు అభిమతం కాదు.

“లవ్వంటే కౌగలించుకోవడాలూ, ముద్దుపెట్టుకోవటాలూ.... పార్కుల్లో దొర్లటాలూ.... డ్యూయట్లు పాడుకోవటాలూ కానేకాదు — అలాంటి సన్నివేశాలంటే నాకు ఎలర్జీ...” నిక్కచ్చిగా — ధైర్యంగా చెప్పాడు గోవిందరావు. అలా చెప్పేటందుకు సిగ్గుపడలేదు.

“మై డియర్ గోవిందరావుగారూ! ప్రేమ అనే సన్నివేశాన్ని ఎంత మొరటుగా చూపిస్తే అంత గొప్పగా చూస్తారు ప్రేక్షకులు!— అసభ్యం... అసహ్యం అంటూ పైకి ఉపన్యాసాలు ఇస్తారు గానీ.... అలాంటివి చూచేందుకు అందరూ ఇష్టపడతారు మనసుల్లో! — ప్రేక్షకుల బలహీనత ‘నాడీ’ మాకు తెలుసు!! — మన పిక్చరూ అలా ఉంటే.... మాకు కనక వర్షం.... మీకు ప్రశంసల వర్షం.... రెండూ దక్కు-

తాయి. అందుచేత దయచేసి మేము చెప్పినట్లు వినండి.” నచ్చచెప్పే ధోరణిలో అంది అంబికాంబ.

అందుకు సిగ్గుపడ్డాడు గోవిందరావు.

చివరకు వాదించి వాదించి ఓడిపోయి, ఆసాంతానికి వాళ్ళు చెప్పినదానికల్లా గాడిదలా తల, కుక్కలా తోక ఆడించక తప్పలేదు.

ఏది ఏమైనా ఛాన్సు జారవిడుచుకోకూడదనుకున్నదే గోవిందరావు ధ్యేయం! సినిమా రచయితగా తన పేరు వెండి తెరమీద చూచుకొని మురిసిపోవాలన్నదే లక్ష్యం!!

అందుకే కట్టుబడి పోయాడు.

* * * *

చచ్చీచెడీ.... మరో పది రోజులు కష్టపడి.... జుట్టు పీక్కుని... స్క్రిప్టు వర్కు పూర్తి చేశాడు.

తిరుగు ప్రయాణానికి సిద్ధపడ్డాడు గోవిందరావు. అందరి దగ్గర సెలవు తీసుకున్నాడు.

కార్లో సెంట్రల్ దాకా తీసుకొచ్చి, రైలు టిక్కెట్టు కొనిపెట్టిన వ్యాఘ్రేశ్వరరావు ట్రెయిన్ కదలబోతుండగా గోవిందరావు చేతిలో ఒక వంద రూపాయల నోటు ఉంచి “ఏదో... ఇది నా ప్రథమ ప్రయత్నం. దేవుడు దయతలచి పిక్చరుపోతే... అప్పుడు తమకు ఘనంగా ముట్టచెప్తాను...” అని చెవిలో రహస్యం చెప్పాడు.

ఏం జవాబివ్వాలో తెలియని గోవిందరావు అదోలా నవ్వేశాడు.

రైలు కదిలి ముందుకు సాగిపోయింది.

* * * *

నవ మాసాలు మోసి... పురిటి నొప్పులు భరించి... ప్రసవించిన ఆడదాని లాగ... చాలా రిష్టాలు దాటుకుని చివరికి ఒక శుభ ముహూర్తాన గోవిందరావు సినిమా రిలీజైంది.

రిలీజుకి ముందు రోజే... వూరంతా తిరిగి తన సినిమా తప్పక చూడవలసిందిగా ఫ్రెండ్సుకి, పరిచయస్తులకు... తెలియని వాళ్ళకు... వీధిలో అందరికీ తెలియచెప్పి చిన్న చాటింపు లాంటిది వేశాడు.

తన గుండె మీద బరువు తీర్చుకున్నట్టు ఫీలయ్యాడు—తృప్తి పడ్డాడు— గర్వపడ్డాడు.

పట్టలేని ఆనందం గోవిందరావులో ఉదకలు వేయనారంభించింది.

సినిమా చూడకుండానే అంతా పొగిడారు— మెచ్చుకున్నారు—భేష్ అన్నారు.

ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అనిపించింది. ఎంత త్వరగా సినీమా చూడటమా అని ఉవ్విళ్ళూరసాగాడు.

ఆఫీసుకు సెలవు పెట్టి మొదటి రోజు మొదటి ఆట చూడాలనుకున్న గోవిందరావు ఆశయం లీవు గ్రాంటుకాని కారణంగా నేర వేర లేదు.

అందుకు నిరుత్సాహపడ్డాడు! ఆఫీసు గోడగడియారం కేసి పదే పదే చూస్తూండి పోయాడు. పని మీద మనసు లగ్నం కావటం లేదు. ఎంతకీ టైమ్ గడవదేమో అని పిస్తూంది.

'హమ్మయ్య – అయిదు గంటలైంది' అనుకుని... చివరి కెలాగో ఆఫీసు నుంచి బైటపడి రిక్షాలో ఇల్లు చేరు కున్నాడు.

స్నానం ముగించి, ఇస్త్రీ బట్టలు వేసుకుని, కాస్త సెంటు రాసుకుని మళ్ళీ రిక్షా ఎక్కాడు గోవిందరావు.

క్యూలో నిల్చోకుండానే టిక్కెట్టు సంపాదించుకో గలిగాడు.

బాల్కనీలో ఉన్న ఒక సీట్లో ఠీవిగా కూర్చుని రిలాక్స య్యాడు.

న్యూస్ రీలు మొదలైంది.

క్షణక్షణానికీ గోవిందరావు శరీరంలో ప్రవహించే నెత్తురు వేగంగా గుండెలోకి ప్రసార మవుతున్నట్టు అని స్తూంది. బ్లడ్ ప్రెషర్ వచ్చినట్టు ఫీలవుతున్నాడు.

టైటిల్సు మొదలైనయ్.

కథ, మాటల రచయితగా తన పేరు ఎక్కడా కన్పిం చలేదు.

సినిమా మొదలైంది.

గోవిందరావులో ఆరాటం తగ్గింది. కోపం చోటు చేసుకో నారంభించింది. కంగారు హెచ్చింది. మనిషిలో వణుకు, దడ, రొప్పు తొంగిచూస్తోంది.

గోవిందరావుకి స్పృహ ఎప్పుడు తప్పిందో తెలీదు. సీట్లో వాలిపోయాడు.

ఆట వదిలారు. జనం వెళ్ళిపోయారు.

హాలు తలుపులు మూశారు.

చేతిలో చీపురుతో స్వీపరు హాలు వూడ్చటం మొదలు పెట్టాడు.

వూడ్చుకుంటూ వచ్చి గోవిందరావుని చూశాడు.

"సార్! – సినిమా అయిపోయి పావుగంట అయింది. ఇంకా నిద్రపోతున్నారా? — నిద్రపోయే వాళ్ళు సినిమా కెందుకుసార్ రావటం?... లేక మందుకొట్టి జోగుతున్నారా?", అడిగాడు స్వీపరు.

జవాబు లేకపోవటంతో 'ఈ మనిషి చచ్చిగాని పోలేదు గదా' అనుకున్న స్వీపరు దగ్గరగా వచ్చి గోవిందరావుని కుదిపాడు.

నీరసంగా కళ్ళు తెరిచాడు గోవిందరావు. పరిస్థితి అర్థం కానట్టు చుట్టూ చూశాడు.

ఏం సార్? మనదీ వూరుకాదా — ఇంకా హాల్లోనే నిద్రపోతున్నారూ? అడిగాడు స్వీపరు ఘాడుస్తూనే.

రెండున్నర గంటల సినిమాలో తాను వ్రాసిన డైలాగు కానీ ... మచ్చుకొక సీనుగానా కన్పించలేదు. తనకు సినిమా వాళ్ళు తీరని అన్యాయం చేశారు. ఇంత దారుణమా? అనేసి తనలో తాను వాపోయాడు. గుండె బాదుకొన్నాడు గోవిందరావు.

అడుగులో అడుగేసుకొంటూ హాల్లోంచి బైటికొచ్చాడు.

'ఒరేయ్! తెలుగు కథా రచయితా నువ్వు సినిమా రచయితగా పనికిరావ్... పైకి రావ్... నువ్వు చచ్చిపో... లేకుంటే... వాళ్ళే నిన్ను పీక పిసికి చంపేస్తారు అని గోవిందరావు అంతరాత్మ ఘోషించింది.

నీరసించిపోయిన హృదయంతో..... గుండె నిండా ఆవేదనతో రిక్షా ఎక్కేడు దిక్కు తోచని గోవిందరావు.

[ 8-11-78 ఆంధ్రప్రభ వార పత్రిక ]

*With the best compliments*

*from*

★

## Sri Kandhaswamy Body Works

**Bye - Pass Road, VELLORE - 632 004**

(N. A. Dt.) Tamil Nadu.

**Experts in Bus, Lorry, Van, Auto body building also in Painting & Tinkering Works.**

**Bus Body building Contractors for A. P. S. R. T. C. in CUDDAPAH Region**

*Prop :-* **S. RAMAMOORTHY.**

*With the best compliments*

*From*

★

# M/s. South India Starch Industries,

*Manufacturers of :*

**BEST TAMARIND SEED POWDER**

**PALMANER - 517 408**

CHITTOOR Dt. (A. P.)

*Prop :* **M. LOKANATH**

Grams : ***'LIBERTY'***

**Phone :** { **Office. 250** / **Resi. 277** }